# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!




## పచ్చని పంటల్లో 'కౌలుదారు' కుంపట్లు..!



ప్రభుత్వ రికార్డుల్లోకి కౌలుదారు పేరు కూడా..
యాజమాన్య హక్కులకు ఎసరు పెట్టే ప్రమాదం
ఆ చట్టంతో మళ్లీ దళారుల రాజ్యం
అమల్లోకి వస్తే కూలీల ఉపాధి దెబ్బతినే ఛాన్స్
కాంగ్రెస్‌పై దుమ్మెత్తి పోస్తున్న రైతులు

యాదాద్రి భువనగిరి, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ) : 'కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కౌలుదారు చట్టం తీసుకొస్తాం' ఇదీ సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క స్వయంగా చేసిన కామెంట్. ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రైతుల గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తున్నాయి. ఈ చట్టం తీసుకొస్తే రైతులకు ఉరే గతి అని ఆందోళన చెందుతున్నారు. దాని ప్రకారం రైతులు తమ భూమిని కౌలుకు ఇస్తే కచ్చితంగా ప్రభుత్వ రికార్డుల్లో నమోదవుతుందని, దీంతో భూయజమాన్య హక్కులకే ఎసరు వచ్చే ప్రమాదం వస్తుందని గుబులు పడుతున్నారు. అంతేకాకుండా న్యాయస్థానంలో నిలబెట్టే పరిస్థితి ప్రమాదం ఉంది. దీంతో పల్లెల్లో కౌలు చిచ్చు రాజుకోవడంతోపాటు ఊర్లలో ప్రశాంతత దెబ్బతింటుంది. రైతులు తమ భూములను కౌలుకు ఇవ్వడానికి వెనకాడుతారు. ఫలితంగా రైతులకు ఉపాధి మార్గాలు తగ్గడంతోపాటు ఉత్పత్తి, దిగుబడి తగ్గుతుంది. కౌలుచట్టం దళారీ రాజ్యానికి బార్లా తలుపులు తెరుస్తుంది. ఇలాంటి ప్రమాదకరైమన చట్టాన్ని కాంగ్రెస్ తీసుకొస్తామనడంతో రైతులు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. ప్రశాంతంగా ఉన్న రైతుల జీవితాల్లో కుంపట్లు పెడతారా? అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కాంగ్రెస్‌ను గెలవనీయబోమని, కౌలుదారు చట్టం ఆలోచన ఆదిలో తుంచేస్తామని ఘంటాపథంగా చెబుతున్నారు. ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు బ్రహ్మరథం పడతామని, కాంగ్రెస్ అభ్యర్థుల డిపాజిట్లను గల్లంతు చేస్తామని శపథం చేస్తున్నారు.

### భూములన్నీ గోల్‌మాల్ చేస్తరు



కాంగ్రెస్ పార్టీ ధరణిని రద్దు చేస్తామంటుంది. ఆ పార్టీ నాయకులకు అంత అహంకారం ఎందుకో నాకు అర్థమైతలేదు. మూడు గంటల కరెంట్ అంటరు. 10హెచ్‌పీ మోటర్ అంటరు. ధరణిని తీసేస్తామంటరు. రైతులంటే వాళ్లకు కండ్ల మంట ఎందుకో? మళ్లీ పైరవీల రాజ్యం తెచ్చి జేబులు నింపుకోవాలన్నదే వాళ్ల స్కెచ్. వాళ్లు వస్తే దళారుల ప్రమేయం పెరిగి భూమలన్నీ గోల్‌మాల్ జరుగుతయ్. రైతుల మధ్య కొట్లాటలు పెడుతరు. పట్టాదారు స్థానంలో తిరిగి అనుభవదారు, మాన్యందారు కాలం పెడితే నిజమైన పట్టాదారులకు తిప్పలు తప్పవు. రోజుల తరబడి అధికారులు, లీడర్ల చుట్టూ తిరిగే రోజులు మళ్లీ వస్తాయి. ఏదిఏమైనా ధరణి వ్యవస్థ ఉండాలి. కేసీఆర్ సారు మళ్లీ సీఎం కావాలి.

– కనగాటి వెంకట్‌రెడ్డి, కందులవారిగూడెం, నేరేడుచర్ల మండలం

### మళ్లీ పట్వారీ వ్యవస్థ వస్తే ఇబ్బందే

గతంలో నా భూమి విషయంలో సమస్య ఉండడంతో ఎన్నోసార్లు తాసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా పరిష్కారం కాలేదు. తెలంగాణ ప్రభుత్వం వచ్చినాక కేసీఆర్ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణితో నా సమస్య పరిష్కారమైంది. ఇగ ఇప్పుడు కాంగ్రెసోళ్లు ధరణి తీసేస్తామంటున్నరు. ధరణి తీసేస్తే నాలాంటి రైతులకు అన్యాయం జరుగుతది. మళ్లీ పట్వారీ వ్యవస్థ వస్తే ఇబ్బంది అవుతది. రైతులకు ధరణి బాగున్నది. ఎన్నికల లబ్ధి కోసం పాత రెవెన్యూ పద్ధతిని తీసుకొస్తామని కాంగ్రెస్ నాయకులు చెబుతూ రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారు.

– సాముల పుల్లారెడ్డి, రఘునాథపాలెం, మఠంపల్లి మండలం

### ధరణి రద్దు చేస్తే దళారులదే రాజ్యం



కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ధరణి రద్దు చేస్తామని చెబుతుంది. అట్లయితే తిరిగి దళారుల రాజ్యం వస్తది. ఇన్నేండ్లు రైతులు తమ భూములను తమ పేరు మీదకు తెచ్చుకునేందుకు దళారులను ఆశ్రయించి లంచాలు ఇస్తేనే పని అయ్యేది. సీఎం కేసీఆర్ ధరణి పోర్టల్‌ను తీసుకురావడంతో ఆ తిప్పలన్నీ తప్పిపోయాయి. దళారీ వ్యవస్థ పూర్తిగా రద్దయిపోయింది. గతంలో ఎవరైనా భూమిని కొనుగోలు చేస్తే రిజిస్ట్రార్ కార్యాలయంలో రోజంతా ఉంటేనే డాక్యుమెంటేషన్ పూర్తయ్యేది. దాన్ని రెవెన్యూ అధికారులకు అందించి దళారుల ద్వారా ముడుపులు అప్పజెప్పి నెలల తరబడి కార్యాలయం చుట్టూ తిరిగితే గానీ మ్యుటేషన్ చేసేది. ధరణి వచ్చిన తర్వాత ఆ తిప్పలన్నీ తొలగిపోయాయి. స్లాట్ బుక్ చేసుకుని టైమ్‌కు వెళ్తే 15 నిమిషాల్లోనే పట్టా మార్పిడి చేసి సంబంధిత కాగితాలను మన చేతికిచ్చి పంపిస్తున్నారు. ఎవరికీ ఒక్క పైసా ఇవ్వకుండానే పని పూర్తవుతుంది. అంత మంచి ధరణిని రద్దు చేస్తామనడం సరికాదు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఓటేవరికి వేయాలో రైతులు నిర్ణయించుకోవాలి.

– నూకల రాంరెడ్డి, రైతు, గరిడేపల్లి



### ధరణి పోతే రైతులు ఆగమే

కేసీఆర్ సారు ప్రవేశపెట్టిన ధరణితో భూముల సమస్యలు మొత్తం తొలగిపోయినయ్. గొడవలు, పంచాయితీలు లేకుండా పల్లెలన్నీ ప్రశాంతంగా ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం రాకమునుపు భూములు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నా, మ్యుటేషన్ చేయించుకోవాలన్నా నెలలు పట్టేది. ఎమ్మార్వో ఆఫీసుల కాడ జనాలు గుంపులు గుంపులుగా ఉండేది. ధరణితో ఆ సమస్యలన్నీ తీరినయ్. రైతు బంధు పైసలు కరెక్టుగా మా ఖాతాల్లో జమ అవుతున్నాయి. గతంలో పటేల్, పట్వారీ వ్యవస్థతో రైతుల బతుకులు ఆగమైనయ్. మళ్లీ ఆ విధమైన పద్ధతి తీసుకొస్తే రాష్ట్రంలో ఏ ఒక్క రైతూ వ్యవసాయం చేసుకోడు. ఒకరి భూములు మరొకరి పేరున ఎక్కడం, ఆఫీసుల చుట్టూ తిరగడమే తప్ప మరోటి ఉండదు.కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కౌలుదారుల చట్టం తీసుకొస్తామంటున్నారు. అప్పుడు ఒప్పంద పత్రం రాసి ఇవ్వాల్సి వస్తది. దాంతో భూయజమానులకు, కౌలుదారులకు మధ్య గొడవలు జరుగుతాయి. పోలీస్ స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరగడమే సరిపోతుంది. ఇప్పుడు సీఎం కేసీఆర్ పాలనలో రైతులకు చాలా మంచిగా ఉన్నది. మళ్లీ కేసీఆర్ ప్రభుత్వమే రావాలి.


– సింగారపు కోటయ్య, రైతు, వల్లభాపురం, చివ్వెంల మండలం



రైతుల పచ్చని జీవితాల్లో కాంగ్రెస్ మంటలు రేపే కుట్ర చేస్తున్నది. ప్రశాంతంగా జీవిస్తున్న అన్నదాత కడుపుకొట్టే కుయుక్తులు పన్నుతున్నది. దేశానికే బువ్వగిన్నెగా మారిన తెలంగాణను ఆగం చేసే పన్నాగం పన్నుతున్నది. 24 గంటల కరెంట్ వద్దని, 3 గంటల కరెంట్ చాలని సల్లని చావు కబురు చెబుతున్నది. 10హెచ్‌పీ మోటర్లు బిగించుకోవాలని.. ఎద్దు, ఎవుసం గురించి తెలియకుండా ఉచిత సలహాలు ఇస్తున్నది. అసలు రైతుల వద్ద 10హెచ్‌పీ మోటర్లే ఉండవనే సోయి లేకుండా కాంగ్రెస్ నేతలు కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారు. రైతులు ఉపయోగించేవి 3హెచ్‌పీ, 5హెచ్‌పీ మోటర్లు అనే విషయం తెలియకుండా కారుకూతలు కూస్తున్నది. ఇట్లయితే ఉమ్మడి రాష్ట్రంలో లెక్క మళ్లీ మోటర్లు కాలుడు, ట్రాన్స్‌ఫార్మర్లు పేలుడు కథే ఉంటదని రైతులు భగ్గుమంటున్నారు. 10హెచ్‌పీ మోటర్లు కొంటే ఒక్కొక్కరిపై రూ.లక్షకు పైగా ఆర్థిక భారం ఎవరు భరిస్తారని ఆందోళన చెందుతున్నారు. బీఆర్ఎస్ పాలనలో 24గంటల నాణ్యమైన కరెంట్ వస్తుందని, అలాంటి మంచి పాలనను ఎట్ల వదులుకుంటామని చెబుతున్నారు.

– యాదాద్రి భువనగిరి, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ)

మళ్లీ మోటర్లు కాలుడు..
ట్రాన్స్‌ఫార్మర్లు పేలుడే..
కాంగ్రెస్ పాలనలో పొలం వద్దే రాత్రంతా పడిగాపులు
కొత్త మోటర్లతో ఒక్కో రైతుకు లక్షకు పైగా ఖర్చు
హస్తం పార్టీకి ఓటేస్తే కాళ రాత్రులే గతి..





# కాంగ్రెస్‌ను బొంద పెడ్తం

## 10హెచ్‌పీ మోటర్ల పేరెత్తితే భగ్గుమంటున్న అన్నదాత

### కాంగ్రెస్ హయాంలో ఎకరం పారుడు కూడా కష్టమయ్యేది

గత కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో కరెంట్ సక్రమంగా రాక తీవ్ర ఇబ్బందులు పడ్డాం. ఎకరం, రెండెకరాల పొల పారుడే కష్టంగా ఉండేది. కరెంట్ కోసం బావుల వద్ద రాత్రింబవళ్లు పడిగాపులు కాసి పంటలు సాగు చేసుకున్నాం. అయినా కరెంట్ సక్రమంగా రాక పంట నోటి దగ్గరకు వచ్చేసరికి ఎండిపోయేది. లో వోల్టేజీ సమస్యతో ట్రాన్స్‌ఫార్మర్లు ఎప్పుడు పడితే అప్పుడు కాలిపోయేవి. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక 24 గంటల నాణ్యమైన కరెంట్ ఇస్తున్నది. దాంతో పంటలు పుష్కలంగా పండించుకుంటున్నాం. మళ్లా ఇప్పుడు కాంగ్రెస్ నాయకులు 10హెచ్‌పీ మోటర్లు అంటున్నరు. వాటికి ఖర్చు ఎక్కువ అవుతది. బోర్లు ఎండిపోయే పరిస్థితి వస్తది. రైతులందరం సీఎం కేసీఆర్ వెంటే ఉంటాం.

– బోళ్ల మంగారెడ్డి, రైతు, మునగాల



### 10హెచ్‌పీ మోటరుతో వ్యవసాయం చెయ్యలేం

మాకు ఐదెకరాల వ్యవసాయ భూమి ఉన్నది. తెలంగాణ ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్న 24గంటల కరెంటుతో రెండు కార్లు పంటలు బాగా పండుతున్నాయి. ఈ వ్యవసాయాన్ని సాగు చేయడానికి నేను 5హెచ్‌పీ మోటరు వాడుతున్నా. ఇప్పటి వరకు ఎలాంటి సమస్య రాలేదు. కాంగ్రెస్ పార్టీ 10హెచ్‌పీ మోటరు వాడుకోవాలని చెపుతున్నది. 10హెచ్‌పీ మోటరు వాడాలంటే కరెంటు వైర్లు, పైపులు మార్చాలి. కాంగ్రెస్ నాయకులు 3గంటల కరెంటు చాలంటున్నరు. 3గంటల కరెంటుతో అందరూ ఒకే సారి మోటర్లు అన్ చేస్తారు. దాంతో ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోతుంది. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ వచ్చే వరకు ఉన్న పొలం ఎండిపోతుంది. ఇప్పుడు సీఎం కేసీఆర్ ఇస్తున్న కరెంటు మంచిగనే ఉన్నది. రేవంత్‌రెడ్డికి వ్యవసాయం గురించి అంతగా తెలిసినట్టులేదు. అందుకే 3గంటల కరెంటు, 10హెచ్‌పీ మోటర్లు అంటున్నడు.

– ఎండీ మొహినొద్దీన్ పాషా, ఏనుబాముల, ఆత్మరూర్.ఎస్ మండలం

### 3గంటల కరెంట్‌కు 10హెచ్‌పీ మోటర్లు కావాల్నా?

కేసీఆర్ సారు సక్కగా 24గంటల కరెంట్ ఇస్తుంటే పంటలు పండి తెలంగాణ సల్లగా ఉన్నది. ఇప్పుడు ఈ దొంగ కాంగ్రెసోళ్లు వచ్చి 3గంటల కరెంట్ ఇస్తామంటున్నరు. ఆ మూడు గంటలకు 10హెచ్‌పీ మోటర్లు కొనుక్కోవాల్నట. వాళ్ల మెదళ్లు మోకాళ్ల కిందికి జారినట్టుంది. 24 గంటల కరెంట్ వదులుకొని మూడు గంటలను ఎవరైనా కోరుకుంటరా. చెప్పేటోనికి శరం లేకున్నా.. ఇనేటోనికన్నా ఇజ్జత్ ఉండాలిగా. 50ఏండ్లు పాలించిన కాంగ్రెస్ వాళ్లు సోయిలేక సొల్లుగారుస్తూ మాట్లాడుతున్నరు. ఇవాళ రైతుల మీద సోయొచ్చిందేమో కాంగ్రెస్ వాళ్లకు. సీఎం కేసీఆర్ రైతు సంక్షేమం కోసం నిరంతరం పాటుపడుతూ ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతు బీమా ఇస్తున్నరు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కొంటున్నరు. ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి రైతన్నను ఆదుకుంటున్నరు.

– చన్నబోయిన సైదులు, నరసింహులగూడెం, నాగారం మండలం



### కాంగ్రెస్ మళ్లీ కరెంటు కిరికిరి పెడుతున్నది

ఇప్పుడు ఎన్నికల్లో మోసపోయి కాంగ్రెస్‌కు ఓటేస్తే రైతులకు మళ్లీ చీకటి రోజులు తప్పవ్. కేసీఆర్ సర్కారులో వ్యవసాయానికి కరెంట్ ఢోకా లేదు. 24 గంటల కరెంట్ వల్లే ఇబ్బందులు లేకుండా పంటలు పండుతున్నయ్. మా కష్టాలు గట్టెక్కాయి. ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్ కరెంట్ కిరికిరి పెడుతున్నది. మూడు గంటల కరెంట్ ఇస్తే ఎకరం పొలం పారదు. నిత్యం కరెంట్ ఇబ్బందులు తప్పవ్. ఎకరం రెండెకరాల పొలం ఉన్న నా లాంటి రైతు రోజూ బోరు వద్దే కూర్చోక తప్పదు. 10 హెచ్‌పీ మోటరు కొనాలంటే కనీసం రూ.50 వేల ఖర్చు అవుతది. లోవోల్టేజీ సమస్య, ట్రాన్స్‌ఫార్మర్లపై భారం పడి కాలిపోతాయి. ఇలాంటి తప్పుడు నిర్ణయాలు చేసే కాంగ్రెస్‌ను, ఆ పార్టీ తరపున చెబుతున్న రేవంత్‌రెడ్డి మాటలు నమ్మం. 24 గంటల కరెంట్ అందిస్తున్న కేసీఆర్ సర్కారుకు మద్దతు ఇస్తాం. మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి అయితేనే రైతుల బాధలు తీరుతయ్.

– సుదగాని రాములు, రైతు, మోత్కూరు



### కాంగ్రెస్ నాయకులు అజ్ఞానంతో మాట్లాడుతున్నారు



అధికార వాంఛతో పంటల సాగుపై కాంగ్రెస్ నాయకులు అజ్ఞానంతో మాట్లాడుతున్నారు. బోరులో నీళ్లు పుష్కలంగా ఉంటేనే, 24 గంటల కరెంట్ వస్తేనే పొలం పారుతుంది. మూడు గంటల కరెంటుతో మడి కూడా తడువదు. 10 హెచ్‌పీ మోటర్లు ఏ రైతూ ఇంతవరకు వాడలేదు. ఇప్పుడున్న 5 హెచ్‌పీ మోటర్లకే కరెంట్ ఎక్కువ కాలుతుంది. మూడు గంటలు చాలనే నాయకులు.. 10 హెచ్‌పీ మోటర్లు పెడితే మరింత కరెంటు కాలదా? కాంగ్రెస్ నాయకులు రైతులను తప్పుదోవ పట్టిస్తున్నరు. తెలంగాణ రాష్ట్రం రాకముందు కాంగ్రెసోళ్లకు రైతులపై ఇంత ప్రేమ ఎందుకు లేదు? బీఆర్ఎస్ ప్రభుత్వం 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నది. దాంతో రాత్రుళ్లు చేను కాడికి పోవడం లేదు. తొమ్మిదేండ్లుగా రైతు సంక్షేమానికి పాటుపడుతున్న బీఆర్ఎస్ పార్టీకే రైతుల మద్దతు ఉంటది.

– సింగిరెడ్డి అప్పిరెడ్డి, రైతు, మొగలాయికోట, అనంతగిరి మండలం

### 10హెచ్‌పీ మోటరుతో అన్ని రకాలుగా నష్టమే

10హెచ్‌పీ మోటరుతో రైతులకు అన్ని విధాలా నష్టమే. ఆ మోటర్లతో వ్యవసాయం చేయడమే దండుగ. దానికి పెట్టుబడి పెట్టాలంటే రైతులు అప్పులు చేయాల్సిందే. ఒక్క 10హెచ్‌పీ మోటరు మూడు త్రీ హెచ్‌పీ మోటర్లతో సమానం. వాటికి ఇప్పుడున్న ట్రాన్స్‌ఫారాలు పనిచేయవు. ప్రత్యేకంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలి. బొర్లల్ల చుక్క నీరు కూడా మిగలదు. చుట్టుపక్కల బోర్లన్నీ ఎండిపోతాయి. రైతులు దివాళా తీయడానికే ఇవ్వన్నీ చేస్తున్నారు. త్రీ హెచ్‌పీ మోటర్లు కొంచెం కరెంట్ డిమ్ముగా ఉన్నా ఎత్తుకుంటాయి. 10 హెచ్‌పీ మోటర్లు అస్సలే పని చేయవు. మోటర్లు ఎక్కువగా కాలిపోయే ప్రమాదం ఉంటది. రైతులు సంతోషంగా ఉండటం కాంగ్రెస్ వాళ్లకు గిట్టడం లేదనిపిస్తుంది.



– తెడ్డు భాస్కర్, జలాల్‌పురం, తిరుమలగిరి మండలం